
రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త



# మున్సిపల్ మేనేజర్‌పై వేటు

## డబుల్ బెడ్ రూమ్ లబ్దిదారుల ఎంపిక ప్రక్రియ కార్యక్రమంలో రభస ఎఫెక్ట్

**తాండూరు, జూన్ 30, ప్రభాతవార్త :** వికారాబాద్ జిల్లా తాండూరు మున్సిపల్ మేనేజర్ నరేందర్ రెడ్డిపై సస్పెన్షన్ వేటు పడింది. ఇటీవల తాండూరు మున్సిపల్ కార్యాలయంలో జరిగిన డబుల్ బెడ్ రూమ్ రభస.. కార్యాలయంలో జరిగిన రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఆయనపై వేటు పడినట్లు తెలిసింది. కార్యాలయంలో నిర్వహించిన డబుల్ బెడ్ రూమ్ రాండమైజేషన్ కార్యక్రమంలో కౌన్సిలర్లను ఆహ్వానించడంలో తప్పులు దొర్లాయి.. బిజేపీ పార్టీకి సంబంధించిన ఫ్లోర్‌లీడర్‌కు అందించన సర్క్యులర్‌లో ఏకంగా ఎంఐఎం పార్టీ ఫ్లోర్‌లీడర్ అంటూ ప్రచురించడం దుమారాన్ని రేపింది. ఆ పార్టీ నేతలు బహిరంగంగానే అధికారుల తీరుపై విమర్శలు గుప్పించారు. అంతేకాకుండా కార్యక్రమ నిర్వాహణలో మున్సిపల్ మేనేజర్ నిర్లక్ష్యం వహించినట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేసినట్లు తెలిసింది. ఈ సంఘటన అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

# సరూర్‌నగర్‌లో పేలుడు కలకలం

## ఓ ఇంట్లో వంటగది ధ్వంసం - ఆకస్మిక విస్ఫోటనంపై ఆందోళన

### సేఫ్‌గా ఉన్న గ్యాస్ సిలిండర్లు

**హుడాకాంప్లెక్స్, 30 జూన్, ప్రభాతవార్త :** మహేశ్వరం నియోజకవర్గం, సరూర్‌నగర్ డివిజన్‌లోని బాపూ నగర్‌లోని ఓ ఇంట్లో అనుమానస్పదమైన పేలుడు సంభవించింది. ఈ పేలుడు ధాటికి వంటగది పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు గోడకూలి, వస్తువులు చిందర వందరగా పడ్డాయి. వివరాల్లోకి వెలితే దేవరశెట్టి దేవేందర్ అనే వ్యక్తి విశ్రాంత బ్యాంక్ ఉద్యోగి. 1993లో ఈయన బాపూనగర్‌లోని రోడ్డు నెంబరు 4లో ఇక ఇంటిని కొనుగోలు చేశాడు. 2007లో పేలుడు జరిగిన పైఅంత స్తును రినేవేషన్ కూడా చేయించాడు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు అందరు అల్పాహారం చేసి హాల్‌లో కూర్చున్నారు. 10.45 నిమిషా ప్రాంతంలో ఒక్కసారిగా >>2

# 40 ఏళ్ల అంకిత భావానికి సెల్యూట్

## ముగ్గురు రిటైర్డ్ పోలీస్ అధికారులకు వీడ్కోలు

**వికారాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు విశేష సేవలందించి పదవీ విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను జిల్లా ఎస్పీ స్నేహా మెహ్రా, ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ఈ సమావేశంలో 41 సంవత్సరాల నాలుగు నెలల పాటు సుదీర్ఘ సేవలు అందించిన జిల్లా స్పెషల్ బ్రాంచ్ ఎస్ఐ బి. గైబప్ప, 40 సంవత్సరాల ఐదు నెలల పాటు సేవలందించిన ఏఆర్ఎస్ఐ జి. బిచ్చప్ప, 37 సంవత్సరాల ఆరు నెలల పాటు సేవలందించిన జిల్లా రిజర్వ్ ఆర్మ్డ్ రిజర్వ్ ఏఆర్ఎస్ఐ ఎమ్.ఎ. సలీమ్‌లను ఎస్పీ శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీస్ ఉద్యోగం అనేది కేవలం విధి నిర్వహణ మాత్రమే కాదు, ప్రజల పట్ల పూర్తి బాధ్యతతో కూడిన ఒక పవిత్రమైన సేవ అని కొనియాడారు. పదవీ విరమణ పొందిన ఈ ముగ్గురు అధికారులు తమ సుదీర్ఘ ప్రస్థానంలో ప్రదర్శించిన అంకితభావం, క్రమశిక్షణ నేటి యువ పోలీస్ సిబ్బందికి ఎంతో స్ఫూర్తిదాయకమని ఆమె పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎలాంటి మచ్చ లేకుండా నాలుగు దశాబ్దాల పాటు సేవలందించి రిటైర్ అవ్వడం అభినందనీయమని, వారంతా శేషజీవితాన్ని ప్రశాంతంగా, ఆరోగ్యకరంగా గడపాలని ఎస్పీ ఆకాంక్షి ంచారు. ఈ వీడ్కోలు కార్యక్రమంలో డీటీసీ డీఎస్పీ శ్రీనివాస్, డీఎస్బీ ఇన్‌స్పెక్టర్ నాగార్జున, ఆర్ఐ నాగరాజు, పోలీస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ అశోక్ మరియు డీపీఓ సిబ్బంది పాల్గొని రిటైర్డ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు.




పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులను సన్మానిస్తున్న ఎస్పీ స్నేహామెహ్రా

# జోడీ కొడతారా?

## పదేళ్ల తర్వాత జిల్లాకు ఇద్దరు ఐపిఎస్‌లు

## రాజేశ్ మీనా అదనపు ఎస్పీగా బాధ్యతలు

★ వికారాబాద్‌లో సవాళ్లు విసురుతున్న నేరగాళ్లు ★ ఎన్ని దాడులు చేసిన తగ్గని గంజాయి బ్యాచ్ ★ మారుమూలలకూ విస్తరిస్తున్న నల్లమందు సామ్రాజ్యం ★ కాసుల వేటలో ఖనిజాల మాఫియా ★ ఎస్పీ, ఏఎస్పీ సమిష్టి నిర్ణయాలతో క్రిమినల్స్ కథ ముగియాలని జిల్లా వాసుల ఆకాంక్ష



ఎస్పీ స్నేహ మెహ్రాను మర్యాదపూర్వకంగా కలిసిన ఎఎస్పీ

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వికారాబాద్ జిల్లా పోలీస్ బాస్ స్థానాల్లో భారీ మార్పు చోటుచేసుకుంది. సుదీర్ఘ కాలం తర్వాత జిల్లాకు ఒకేసారి ఇద్దరు ఐపీఎస్ అధికారులను ప్రభుత్వం కేటాయించింది. సీఎం రేవంత్ రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రతిష్టాత్మక జిల్లా కావడం వల్లనే, ఇక్కడి లా అండ్ ఆర్డర్‌ను మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

పదేళ్ల క్రితం నాటి ఎస్పీతో పాటు తాండూరులో చందనదీప్తి ఐపీఎస్ అధికారులుగా పనిచేయగా, మళ్లీ ఇన్నాళ్లకు ఎస్పీ స్నేహ మెహ్రాతో పాటు కొత్తగా రాజేశ్ మీనా అదనపు ఎస్పీగా బాధ్యతలు చేపట్టారు. అయితే, ఈ ఇద్దరు ఉన్నతాధికారుల సమిష్టి నిర్ణయాలతో జిల్లాలో క్రిమినల్స్ కథ ముగుస్తుందని జిల్లా వాసులు భారీ ఆశలు పెట్టుకున్నారు. కానీ, వారి ముందున్న సవాళ్లు అంత సామాన్యంగా ఏమీ లేవు.

**నానాటికీ రెచ్చిపోతున్న గంజాయి ముఠాలు**

జిల్లాలో గంజాయి ముఠాల ఆగడాలు నానాటికీ పెరిగిపోతున్నాయి. ఒరిస్సా నుంచి ముంబాయికి నిత్యం రైళ్ల ద్వారా ఈ నల్లమందు సామ్రాజ్యం విస్తరిస్తోంది. పోలీసులు, ఎక్సైజ్ శాఖ ఎన్నిసార్లు దాడులు చేసి గంజాయి దంపులను ధ్వంసం చేసినా, ఈ ముఠాల నెట్‌వర్క్ మాత్రం తగ్గడం లేదు. ప్రస్తుతం గ్రామ గ్రామానికి గంజాయి పాకేసింది. ఈ మహమ్మారి మత్తుకు బానిసలవుతున్న స్థానిక యువత, చేతిలో పైసలు లేక దొంగతనాలు, దౌర్జన్యాలు చేస్తూ అసాంఘిక బాట పడుతున్నారు.

**హద్దు మీరుతున్న భూ తగాదాలు**

గత కొంతకాలంగా పోలీసులు తీసుకుంటున్న చర్యలు నేరాలను సమూలంగా అరికట్టడంలో అంతంత మాత్రంగానే ఫలితాలనిస్తున్నాయి. ఒకవైపు గంజాయి ముఠాలు, మరో వైపు జిల్లాలో రోజురోజుకూ హద్దులు మీరుతున్న భూ తగాదాలు పోలీసులకు తలనొప్పిగా మారాయి. వీటికి తోడు పెరుగుతున్న ఆత్మహత్యలు, రోడ్డు ప్రమాదాలను అదుపు చేయడం కొత్త ఐపీఎస్ జోడీకి పెద్ద పరీక్షే.

**ఖనిజాల అక్రమ రవాణా జోరు..**

జిల్లాలో సహజ వనరుల లూటీ యథేచ్ఛగా సాగుతోంది. ఇసుక, ఎర్రమట్టి, నాపరాయి (షాబాద్ స్టోన్) అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతోంది. నిబంధనలను తుంగలో తొక్కి రాత్రికి రాత్రే ఖనిజాలను సరిహద్దులు దాటిస్తున్న మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన అవసరం ఎంతైనా ఉంది. దీనితో పాటు అంతర్గతంగా నడుస్తున్న మట్కా దందాలకు కూడా బ్రేక్ వేయాల్సి ఉంది.

**ట్రాఫిక్ నియంత్రణలోనూ చతికల పడుతున్న సిబ్బంది**

పట్టణాల్లో ట్రాఫిక్ సమస్యలు జనాన్ని బెంబేలెత్తిస్తున్నాయి. ప్రధాన కూడళ్లలో సిగ్నళ్లు లేకపోవడం, స్పీడ్ గన్స్ సరిగ్గా వాడకపోవడం, వీటికి తోడు మైనర్ల డ్రైవింగ్ విచ్చలవిడిగా మారడంతో రోడ్లపై నడవాలంటేనే భయపడే పరిస్థితి వచ్చింది. ఈ రద్దీని అదుపు చేయడంలో స్థానిక ట్రాఫిక్ సిబ్బంది పూర్తిగా చతికలపడుతున్నారు.

**జిల్లా వాసుల ఆశలు నెరవేరేనా?**

సిఎం, స్పీకర్ల నియోజకవర్గాలు ఉండటంతో జిల్లాలో నిత్యం వీఐపీల తాకిడి ఎక్కువగా ఉంటుంది. అందువల్ల ఇక్కడ పటిష్టమైన పోలీసు వ్యవస్థ రన్ అవ్వాలి. ఈ నేపథ్యంలోనే ఎస్పీ స్నేహ మెహ్రా, ఏఎస్పీ రాజేశ్ మీనా రంగంలోకి దిగారు. వీరిద్దరి సమిష్టి వ్యూహాలు, కఠిన నిర్ణయాలు ఎంతవరకూ క్రిమినల్స్ ఆటకట్టించగలుగుతాయో చూడాలి.

# ఉత్తమ సేవలను ప్రజలు మర్చిపోరు

## మేడ్చల్ కలెక్టర్ మనుచౌదరి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 30, ప్రభాతవార్త :** ఉద్యోగులు విధి నిర్వాహణలో ప్రజలకు సేవలు అందించటం బాధ్యత అని, వారికి చేతనైనంత సహాయం చేస్తే ఉద్యోగులను గుర్తించుకుంటారని, అదే అసలైన సంపద అని మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. మంగళవారం మేడ్చల్ జిల్లా కలెక్టరే ట్‌లోని విసి హాల్‌లో జిల్లా హౌజింగ్ పిడి రమణ మూర్తి, కలెక్టర్ సిసి బాల భాస్కర్, హౌజింగ్ ఎఇ సుభాష్‌రెడ్డి, ఆఫీస్ సబార్డినేట్ >>2



పదవీ విరమణ చేసిన హౌసింగ్ పిడి రమణమూర్తి దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్

# షాద్‌నగర్‌లో చారిత్రక ఫిరంగులు మాయం

## పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే డిమాండ్

**షాద్‌నగర్, జూన్ 30, ప్రభాతవార్త :** షాద్‌నగర్ పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వెనుక ప్రహరీ గోడ సమీపంలో ఉన్న చారిత్రక ఫిరంగుల నిరక్ష య్ స్థితిపై రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింహులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సరైన చర్యలు తీసుకోలేదని ఆయన పేర్కొన్నారు. తాజాగా ఆ ప్రాంతాన్ని సందర్శించిన బక్కని నర్సింహులు, ఫిరంగి పూర్తిగా దుమ్ము, ధూళితో కప్పబడి ఉండటాన్ని గమనించి స్వయంగా కొంత భాగాన్ని శుభ్రం చేశారు. గతంలో అక్కడ రెండు ఫిరంగులు ఉండేవని, ప్రస్తుతం ఒకటి మాత్రమే కనిపిస్తోందని, మరొకటి కనిపించకపోవడం ఆందోళన కలిగిస్తోందని తెలిపారు. ఈ చారిత్రక ఆయుధాలు గతంలో రాజుల నివాసంగా ఉన్న ప్రాంతంలో ఉండేవని, ప్రస్తుతం ఆ ప్రాంతం రైతు కాలనిగా ప్రసిద్ధి చెందిందని ఆయన వివరించారు. చారిత్రక వారసత్వానికి గుర్తుగా ఉన్న ఈ ఫిరంగులను సంరక్షి ంచి, భవిష్యత్ తరాలకు అందుబాటులో ఉంచేలా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని బక్కని నర్సింహులు కోరారు. ఈ మేరకు ఫిరంగిల మాయంపై షాద్‌నగర్ సహాయ పోలీసు కమిషనర్‌కు సమాచారం అందించినట్లు ఆయన తెలిపారు.



నిర్లక్ష్యానికి గురైన ఫిరంగులను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే నర్సింహులు

# ఒకే పంటపై ఆధారపడకండి

▸ప్రత్యామ్నాయం దిశగా మారాలి ▸అయిల్ ఫామ్ సాగు లాభదాయకం ▸రైతులకు కలెక్టర్ దీపక్ తివారీ సూచన

**కొడంగల్, జూన్ 30, ప్రభాతవార్త :** రైతులు పంట మార్పిడి సాగుకు మొగ్గు చూపాలని కలెక్టర్ దీపక్ తివారీ పిలుపునిచ్చారు. మంగళవారం సిఎం రేవంత్ రెడ్డి హైద్రాబాద్‌లో ప్రారంభించిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమం ప్రత్యక్ష ప్రసారాన్ని పర్సాపూర్ రైతు వేదిక నుండి కలెక్టర్ వీక్షించారు. అనంతరం రైతులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ఒకే పంటపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ పంటలను వేయాలని సూచించారు. జిల్లాలో అయిల్ ఫామ్ పంట సాగును చెపట్టాలని కలెక్టర్ తెలిపారు. అయిల్ పామ్ సాగుపై 60 మందిని అవగాహన నిమిత్తం అశ్వరావుపేట పర్యటనకు తీసుకువెళ్లామని తెలిపారు.

**అకస్మిక తనిఖీలతో హల్‌చల్**

అంతకు ముందు కొడంగల్‌తో పాటు మండలంలోని అంగడిరైచూర్, పర్సాపూర్ తదితర గ్రామాల్లో కలెక్టర్ అకస్మిక తనిఖీలు నిర్వహించారు. పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న 220 పడకల ఆసుపత్రిని పరిశీలించారు. చేశారు. ఆసుపత్రిలో చేపడుతున్న వివిధ విభాగాల పనులను సమీక్షించారు. కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో డయాలసిస్ సెంటర్‌ను పరిశీలించి రోగులు, మందుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా తివారి కొడంగల్ మున్సిపల్ పరిధిలోని గాంధీనగర్ కాలనీలోని పోలింగ్ కేంద్రం 238 పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు అయ్యే విధంగా ప్రత్యేక చొరవచూపాలని బీఎల్ఓకు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమైనా మార్పులు, చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎన్యుమరేషన్ ఫారంలో సమాచారాన్ని పూరించడంలో ప్రజలు సహకరించాలని ఆదేశించారు. కుటుంబ ఓటర్లు వేరే పోలింగ్ స్టేషన్‌లో ఓటు కలిగి ఉంటే ఒకే పోలింగ్ కేంద్రానికి కుటుంబ సభ్యుల ఓట్లు ఉండే విధంగా క్రమబద్ధీకరించాలని అధికారులకు ఆయన సూచించారు.



సిఎం రైతు భరోసా నిధుల విడుదల ప్రత్యక్ష ప్రసారాన్ని పర్సాపూర్ రైతు వేదికలో వీక్షిస్తున్న కలెక్టర్

**తాగునీటి సమస్య పరిష్కారానికి ఆదేశం**

వార్డులో కలెక్టర్ సందర్శించిన క్రమంలో ప్రజలు నీటి సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయం చూడాలని మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. అసవరం అనుకుంటే చేతి పంపుల(బోర్లు) ద్వారా నీటి సమస్యను పరిష్కరించాలని అధికారులకు సూచించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల భవన పనులను పరిశీలించారు. పాఠశాల భవనాన్ని అన్ని హంగులతో నెల రోజుల్లో అందుబాటులోకి తేవాలని కలెక్టర్ తెలిపారు. ప్రహరీగోడ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్ డీఈని ఆదేశించారు.

**పిహెచ్‌సీలో మౌలిక సదుపాయాలకు ప్రతిపాదనలు**

మండల పరిధిలోని అంగడిరైచూర్ పిహెచ్‌సీ ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. అంగడిరైచూర్ పిహెచ్‌సీ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలన్నారు. ఆసుపత్రిలో కావాల్సిన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రసూతి, ఫార్మసీ, ఇన్ పేషెంట్ వార్డు, స్త్రీల వార్డు గదులను పరిశీలించారు. >>2



# కాంగ్రెస్ తల్లి విగ్రహం పెడితే ధ్వంసం చేస్తా..

## తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ హెచ్చరిక

**షాద్‌నగర్, జూన్ 30, ప్రభాతవార్త :** ఉద్యమ కాలంలో సకలజనుల ఆమోదంతో రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహం కాకుండా కాంగ్రెస్ పార్టీ తయారు చేసిన విగ్రహం పెడితే ధ్వంసం చేయడం ఖాయం, మరోసారి జైలుకు వెళ్ళడానికి కూడా సిద్ధం అంటూ తెలంగాణ రాష్ట్ర సహకార యూనియన్ మాజీ చైర్మన్ రాజా వరప్రసాద్ హెచ్చరిక జారీ చేశారు. మంగళవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో రాజా వరప్రసాద్ పేర్కొంటూ తెలంగాణ ప్రాంతానికి దక్కాల్సిన నీళ్ళు, ఉద్యోగాలు, హక్కులు ఇవ్వలేని తెలుగు తల్లి మాకవసరం లేదనే షాద్ నగర్ మండల ప్రజా పరిషత్ ఆవరణలో ఉన్న విగ్రహాన్ని ఆనాడు ఉద్యమ సమయంలో ధ్వంసం చేసి సమైక్య రాష్ట్ర పాలనపై తిరుగుబాటు జెండా ఎగురవేశాం, కేసులు, జైళ్ళు ఎదుర్కొన్నాం. మళ్ళీ ఇప్పుడు అదే స్థలంలో కాంగ్రెస్ పార్టీ రూపొందించిన విగ్రహం పెట్టే కుట్రలు జరుగుతున్నాయి. అదే జరిగితే ఆత్మాభిమానం ఉన్న తెలంగాణ ఉద్యమకారులు ఎవరూ సహించరు అంటూ రాజా వరప్రసాద్ పత్రికా ప్రకటన విడుదల చేశారు.

# డబుల్ గుబులు

## సొంతూళ్లో బెటరా- హైదరాబాద్‌లో ఉండాలా?

### ఎస్ఐఆర్ ప్రక్రియలో ఓటర్ల డైలమా

### సిటీ ఓటు వదులు కోవద్దంటున్న బిజెపి క్యాడర్

**క్యాడర్ దెబ్బతినకుండా జాగ్రత్త పడుతున్న బిఆర్ఎస్, కాంగ్రెస్**

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** ఆగట్టునుంటావా...నాగన్న ఈ గట్టునుంటావా అన్నట్టు ఏదో ఒక గట్టును ఎంచుకోకుంటే.. మొత్తంగా ఓటే మాయమైపోయే ముప్పు పొంచి ఉంది. అటు ఊర్లో, ఇటు హైదరాబాద్‌లో ఓటు హక్కు కలిగిన వారి పరిస్థితి. రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐర్ ప్రక్రియ మొదలైంది. దీంతో డబుల్ ఓట్ల గురించి గట్టి చర్చలే జరుగుతున్నాయి. దీంతో చాలా మంది ఓటర్లలో కంగారు కూడా మొదలైం ది. మరీ ముఖ్యంగా హైదరాబాద్లో ఉంటున్న వాళ్ళలో ఈ టెన్షన్ కనిపిస్తోంది. ఏపీ మూలాలు ఉండి ఇక్కడ స్థిరపడ్డ చాలా మందికి రెండు చో ట్ల ఓట్లు ఉన్నాయి. అలాగే తెలంగాణ గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చి సిటీలో సెటిలైన వాళ్ళలో ఎక్కువ మందికి కూడా సొంత ఊళ్ళో.. హైదరాబాద్లో డ బుల్ ఓట్లు ఉన్నాయి. ఇప్పుడు ఎస్ఐఆర్ ప్రక్రి య మొ దలవడంతో వీళ్ళంతా ఏదో ఒక చోటు ను ఎంచుకోక తప్పని పరిస్థితి. అలాంటి వాళ్ళం తా ఇప్పుడు ఎక్కడ ఉంచుకోవాలి, ఎక్కడ వదు లుకోవాలన్న కన్ఫ్యూజన్‌లో ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలోనే ఓటర్ ఎన్యూమరేషన్‌పై రకరకాల >>2

# పోటీ ప్రత్యర్థులతోనే..

◆సొంతపార్టీ నేతలతో కాదు ◆అంతర్గత విభేదాలకు ఆస్కారం ఇవ్వద్దు ◆క్రమశిక్షణతో పనిచేస్తేనే కమల వికాసం ◆బిజెపి క్యాడర్‌కు పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ దిశానిర్దేశం

**మేడ్చల్, జూన్ 30. ప్రభాతవార్త :** మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలోని ఔషాపూర్‌లో గల రాక్ ఎన్‌క్లేవ్ గార్డెన్‌లో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి ఉమ్మడి మేడ్చల్ మండల బీజేపీ నాయకులు తరలివెళ్లారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నవీన్ పాల్గొని రాష్ట్ర నాయకులు, జిల్లా అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, ముఖ్య కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా పార్టీని మరింత బలోపేతం చేయడం, బూత్ స్థాయి వరకు సంస్థాగత నిర్మాణాన్ని పటిష్ఠం చేయడం, కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడం వంటి అంశాలపై ఆయన మార్గనిర్దేశం చేశారు. ఈ సందర్భంగా నితిన్ నవీన్ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ కార్యకర్తల పార్టీ అని, ప్రతి కార్యకర్త పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ప్రతి నాయకుడు ప్రజల్లోకి వెళ్లి పార్టీ సిద్ధాంతాలను విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. అలాగే పార్టీలో అంతర్గత విభేదాలకు తావివ్వకూడదని, ఒక నాయకుడు మరో నాయకుడితో పోటీ పడే పరిస్థితి ఉండరాదని ఆయన స్పష్టం చేసినట్లు నాయకులు తెలిపారు. పోటీ అనేది ప్రత్యర్థి రాజకీయ పార్టీలతో ఉండాలే గానీ సొంత పార్టీ నాయకుల మధ్య ఉండకూడదని పేర్కొన్నారు. నాయకులందరూ సమన్వయంతో, క్రమశిక్షణతో పనిచేస్తేనే పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆయన సూచించినట్లు వెల్లడించారు. రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన దిశానిర్దేశాల మేరకు మేడ్చల్ జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో మేడ్చల్ జిల్లా నుంచి బీజేపీ మేడ్చల్ మున్సిపల్ అధ్యక్షురాలు జె. శైలజ హరినాథ్, జిల్లా ఉపాధ్యక్షుడు జగన్ గౌడ్, జిల్లా ఉపాధ్యక్షురాలు హంస రాణి, జిల్లా కోశాధికారి లవంగ శ్రీకాంత్, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర నాయకుడు రాగం అర్జున్, మేడ్చల్ ప్రధాన కార్యదర్శి వంశీ విజయ్, యువజన నాయకుడు గౌలికర్ మహేష్, ఎల్లంపేట మహిళా మోర్చా అధ్యక్షురాలు పుష్పారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఔశాపూర్‌లో నిర్వహించిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్

# మూడు వేల కుటుంబాలకు హైడ్రా ఊరట

## 1,166 గజాల పార్కు స్థలానికి ఫెన్సింగ్

**హైదరాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడిపల్లి మండలం, బోడుప్పల్ గ్రామ పరిధిలోని టెలిఫోన్ కాలనీలో ఉన్న1166 గజాల పార్కు స్థలాన్ని హైడ్రా మం గళవారం కాపాడింది. పార్కును కాపాడి.. 3 వేల కుంటుంబాలు, 10 వేల మంది నివాసితులకు హైడ్రా ప్రాణవాయువును అందించింది. వివరాల్లోకి వెళ్తే.. 1974లో గ్రామపంచాయతీ లేఔట్‌గా టెలిఫోన్ కాలనీ ఏర్పడింది. ఇందులో 1166 గజాల స్థలాన్ని పార్కుగా కేటాయించారు. ఈ పార్కు స్థలాన్ని 6 బాగాలుగా చేసి కబ్జాలకు అక్కడ కొంతమంది ప్రయత్నించారు. కాలనీవాసులు పార్కుగా అభివృద్ధి చేస్తుంటే.. కబ్జాదారులు ఆటంకాలు సృష్టిస్తూ వచ్చారు. ఇదే విషయమై హైడ్రా ప్రజావాణిలో టెలిఫోన్ కాలనీ నివాసితులు ఫిర్యాదు చేశారు. >>2



ఆలయ నిర్మాణంకోసం విరాళం అందజేస్తున్న బుయ్యని శ్రీనివాస్ రెడ్డి

## ఆలయ నిర్మాణానికి విరాళం

**ఆర్టీసీఎల్ ఎండి బుయ్యని శ్రీనివాస్ రెడ్డి**

**కుల్కచర్ల,జూన్ 30, ప్రభాతవార్త:** ఆలయాల అభివృద్ధికి కృషిచేస్తామని ఆర్టీఎల్ ఎండి బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని చెల్లాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణం కోసం గ్రామ ప్రజల అభయ మేరకు ఆర్టీఎల్ ఎండి బుయ్యని శ్రీనివాస్‌రెడ్డి ఆలయ కమిటి సభ్యులు తో కలిసి రూ. 50 వేలు విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్టీఎల్ ఎండి బుయ్యని శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ..ఆలయ నిర్మాణంలోప్రజల్లో భక్తిభావం ఏర్పడుతుందన్నారు.అందరూ సన్మార్గంలో నడవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ శకుంతల కేశవులు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కుర్మిద్ద సొసైటీ చైర్మన్‌గా బందె మహేందర్ రెడ్డి ఏకగ్రీవం



నూతన మదర్ డైరీ చైర్మన్, డైరెక్టర్లు

**యాచారం,జూన్30, ప్రభాతవార్త:** యాచారం మండలం కుర్మిద్ద మదర్ డైరీ చైర్మన్ గా పాడి రైతులు 12వ సారి బందె మహేందర్ రెడ్డి ని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన డైరెక్టర్లుగా బి. నర్సిరెడ్డి ,ఎన్ .జగన్ నాయక్‌ను ఎన్నుకోవడం జరిగింది. ఈ ఎన్నికల ప్రక్రియను రిటైర్డ్ టీచర్ జి .కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ.. సొసైటీని లాభాల బాటలో నడిపిస్తూ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నానని చెప్పడం జరిగింది. ప్రస్తుతం సంఘానికి రోజుకు 2300 లీటర్ల పాలు ఉత్పత్తి జరుగుతున్నా రైతులకు మదర్ డైరీ వారు గత రెండు సంవత్సరాల నుండి బిల్లులు ఇవ్వక రైతులకు ఇబ్బంది కలుగజేస్తూ గిట్టుబాటు ధరను కూడా కల్పించడం లేదని తెలిపారు. రైతులను కాపాడడం కోసం గత మార్చి నుంచి ఆవు పాలకు 340/ కేజీ ఫ్యాట్ చొప్పున ,బర్రెపాలకు ..850/ కేజీ ఫ్యాట్ చొప్పున ఇస్తూ రైతులను కాపాడుకుంటున్నానని తెలియజేశారు. మరియు రైతులకు 2020 నుండి ప్రతి సంవత్సరం దసరా పండుగకు బోనస్ కూడా అందజేయడం జరుగుతోందని తెలిపారు. మదర్ డైరీ వారు దీనిపై స్పందించి బిల్లులు త్వరగా క్లియర్ చేసి రైతులకు గిట్టుబాటు ధర కల్పించగలరని కోరారు.

## విజయవంతమైన ఉచిత వైద్య శిబిరం

**తలకొండపల్లి, జూన్ 30, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని వెంకటాపూర్ గ్రామంలో మంగళవారం నాడు నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. హైదరాబాదులోని కామినేని హాస్పిటల్ వారి సహకారంతో స్థానిక గ్రామపంచాయతీ ఆవరణంలో నిర్వహించిన శిబిరానికి గ్రామస్తులు పాల్గొన గా ఉచిత పరీక్షలు నిర్వహించి జ్వరం జలుబు బలానికి మొక్కలకు సంబంధించిన మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బూజురి పుష్పమ్మ అంజన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజల సౌకర్యం కొరకు హైదరాబాదులోని కార్పొరేట్ ఆసుపత్రులతో ఉచిత శిబిరాన్ని ఏర్పాటు చేశామని, ఈ శిబిరం కి హాజరైన వారికి అన్ని పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశానట్లు ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని గ్రామస్తులందరూ సద్వినియోపంచుకోవాలని సందర్భంగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో కామినేని ఆసుపత్రి సిబ్బంది, ఉప సర్పంచ్ చప్పరి చంద్రశేఖర్ వార్డు సభ్యులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ సిబ్బందికి ఉచితంగా నిత్యావసర సరుకులు పంపిణీ



సిబ్బందికి నిత్యవసర సరుకులు పంపిణీ చేస్తున్న సర్పంచ్

**తలకొండపల్లి, జూన్ 30, ప్రభాతవార్త:** తలకొండపల్లి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న గ్రామపంచాయతీ సిబ్బందికి మంగళవారం నాడు గ్రామ సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ ఉచితంగా వారికి నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. గ్రామపంచాయతీ పారిశుద్ధ కార్మికుల సహకారంతో గ్రామం పరిశుభ్రంగా ఉంటుందని, వారి నిర్వహించే పారిశుధ్య పనులకు వెలకట్టలేనిదని సందర్భంగా ఆయన తెలిపారు. అనంతరం వారికి నిత్యవసలా వస్తువులైన కొబ్బరి నూనె, సబ్బులు, తదితర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కటికల శేఖర్ యాదవ్ నాయకులు నాయిని లక్ష్మీ మ్రకాంత్ గౌడ్ తిరుమని రవి గౌడ్ మల్లేష్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## సర్‌పై ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్‌రెడ్డి**

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30, ప్రభాత వార్త:** సర్ కార్యక్రమం పట్ల ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండి తమ వివరాలను నమోదు చేయాలని నిర్లక్ష్యంగా వ్యవహారిస్తే ఓటు కోల్పోయే ప్రమాదం ఉందని మాజీ మున్సిపల్ చైర్మన్ బి. కొండల్ రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ నెంబరు 8లోని అన్నోజిగూడ శ్రీ లక్ష్మీనర్సింహా కాలనీ బూత్ నెంబర్లు 351, 352, 353లలో మాజీ మున్సిపల్ చైర్మన్ మంగళవారం పర్యటించి ప్రజలకు ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంటు కేటీఆర్ ఆదేశాల మేరకు బూత్ లెవల్ నాయకులు ప్రత్యేక శ్రద్ధ వహించి సర్ కార్యక్రమాన్ని పర్యవేక్షించాలని అన్నారు. పార్టీ బూత్ స్థాయి నాయకులు ప్రత్యేక చొరవ తీసుకుని అధికారులను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్‌తో పాటు మాజీ కౌన్సిలర్ చింతల రాజశేఖర్, నాయకులు నానావత్ జితేందర్ నాయక్, బోయపల్లి రాజేశ్వర్‌రెడ్డి, సంతోశ్ నాయక్, రవీందర్, రాజు, గోపాల కృష్ణ, వార్డు ఆఫీసర్ నికిల్, బీఎల్‌వో భవాని, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.



అన్నోజిగూడలో సర్ కార్యక్రమంపై ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి.

# తాడిపర్తిలో 7కోట్ల నిధులతో సిసిరోడ్ల పనులకు శ్రీకారం



తాడిపర్తిలో సిసి రోడ్ల నిర్మాణం ప్రారంభిస్తున్న సర్పంచ్ వార్డుసభ్యులు

**యాచారం, జూన్30, ప్రభాతవార్త :** గ్రామ రూపురేఖలు మార్చడమే ధ్యేయమన్న సర్పంచ్ నీలం రూస్సీ రమేష్ అన్నారు.యాచారం మండల పరిధిలోని తాడిపర్తి గ్రామంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ఆర్థిక సహకారంతో ఆరు కోట్ల 65 లక్షల రూపాయల భారీ బడ్జెట్‌తో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అంతర్గత సిసి రోడ్ల నిర్మాణ పనులను గ్రామ సర్పంచ్ నీలం రూస్సీ రమేష్, స్థానిక నాయకులతో కలిసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..గ్రామంలోని ప్రతి వీధిని సుందరంగా ప్రతి తీర్చిదిద్దడమే కాకుండా, వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న బురద రోడ్ల రవాణా కష్టాలకు ఈ ప్రాజెక్టు ద్వారా శాశ్వత పరిష్కారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. టిజి ఐ ఐ సి అందించిన ఈ భారీ నిధులతో గ్రామంలోని అన్ని ప్రధాన కూడళ్లు, అంతర్గత రహదారులను అత్యాధునిక ప్రమాణాలతో కాంక్రీట్ రోడ్లుగామారుస్తున్నామని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక నిఘా ఉంచుతామని స్పష్టం చేశారు.

పారిశ్రామిక ప్రాంతాల అనుసంధానంతో పాటు గ్రామీణ ప్రాంతాల మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించడంపై తాటిపర్తి గ్రామ ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ ప్రభుత్వానికి,టీజీ ఐ ఐసి అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ ముసిడి రమేష్, పంచాయతీ వార్డు సభ్యులు, దసరథ యాదమ్మ గణేష్, నీలం లక్ష్మమ్మ ఎనుగొండ శ్రీశైలం యూసుఫ్ పఠాన్ యాచారం మమత స్థానిక గ్రామస్థులు పాల్గొన్నారు.

# రాంకీ డంపింగ్ యార్డు తొలగింపే లక్ష్యం

**జవహర్ నగర్, దమ్మాయిగూడ జెఎసిల ఐక్య పోరాటానికి శ్రీకారం**

**జవహర్ నగర్,జూన్30, ప్రభాత వార్త:** రాంకీ చెత్త డంపింగ్ యార్డును పూర్తిగా తొలగించాలనే లక్ష ్యంతో జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ, యాంటి డంపింగ్ యార్డు దమ్మాయిగూడ జేఏసీలు భవిష్యత్ కార్యాచరణపై ఏకాభిప్రాయానికి వచ్చాయి. ఈ మేరకు జవహర్ నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ చైర్మన్ షేక్ షావలి అధ్యక్షతన బీజేఆర్ నగర్‌లో అత్యవసర సమావేశం నిర్వహించారు.సమావేశంలో దమ్మాయిగూడ జేఏసీ కన్వీనర్ డాక్టర్ బి. శంకర్ నారాయణన్, కోకన్వీనర్లు ఎం. సమ్మిరెడ్డి, ఎ. సంజీవరెడ్డి ప్రత్యేక ఆహ్వానితులుగా పాల్గొని డంపింగ్ యార్డు కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న వాయు, నీటి కాలుష్యం, ఆరోగ్య సమస్యలు, పర్యావరణ నష్టాలపై ఆందోళన వ్యక్తం చేశారు. జవహర్ నగర్, దమ్మాయిగూడతో పాటు పరిసర ప్రాంతాల ప్రజలందరూ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా రెండు జేఏసీల కరపత్రాలను ఆవిష్కరించారు.

డంపింగ్ యార్డుకు తాజా చెత్త తరలింపును వెంటనే నిలిపివేయడం, బయోమైనింగ్ ప్రక్రియను వేగవంతం చేయడం, మురుగునీటి ప్రవాహాన్ని అరికట్టడం, బాధిత ప్రజలకు ఉచిత మంచినీరు, వైద్య సౌకర్యాలు కల్పించడం, దుర్వాసనలను నియంత్రించడం వంటి డిమాండ్లపై రెండు కమిటీలు కలిసి పోరాటం కొనసాగించాలని నిర్ణయించాయి.అలాగే జీహెచ్ఎంసీ ప్రత్యామ్నాయ వ్యర్థాల ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసి, డంపింగ్ యార్డు మూసివేత అనంతరం కూడా పర్యావరణ పరిరక్షణ చర్యలను కొనసాగించాలని సమావేశంలో తీర్మానించారు. రాంకీ డంపింగ్ యార్డు తొలగింపు వరకు రెండు జేఏసీలు సమిష్టిగా పోరాటాన్ని కొనసాగించాలని నాయకులు స్పష్టం చేశారు.

# విద్యార్థులకు సౌకర్యాలు,విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి



కీసర ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డితో సమస్యలపై మాట్లాడుతున్న సిపిఎం పార్టీ నాయకులు



ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్ మనూజారెడ్డితో సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సిపిఎం నాయకులు

**కీసర, జూన్30,ప్రభాతవార్త:** విద్యార్థులకు సౌకర్యాలు,విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని సిపిఎం పార్టీ కీసర సర్కిల్ కన్వీనర్ బంగారు నర్సింగ్‌రావు డిమాండ్ చేశారు.మంగళవారం కీసర సర్కిల్ పరిధిలోని కీసరలోని ప్రభుత్వ ప్రైమరీ సెంటర్,ప్రభుత్వ హైస్కూల్‌ను సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా మండల పరిధిలో ఉన్న కీసర ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి ఆస్పత్రి నిర్వహణ సమస్యలను అడిగి తెలుసుకున్నారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనూజారెడ్డిని పరిస్థితి,రోగులకు అందిస్తున్న సేవల గురించి వివరించడం జరిగింది.ఇందులో ప్రధానంగా ప్రైమరీ హెల్త్ సెటర్కు రోజువారిగా ఓపికి సుమారు 80 నుంచి 90 మంది రోగులు వస్తున్నారని తెలిపారు.అయితే ఇక్కడ స్టాఫ్ నర్స్ తక్కువగా ఉండటం వల్ల కొంత ఇబ్బందులు ఉన్నాయన్నారు.నెలలో సుమారు 15 నుండి 20 డెలివరీ జరుగుతున్నాయన్నారు.ఆసుపత్రిలో 24 గంటలు సర్వీసులో ఉంటున్నారు.అయితే ఇక్కడ వాచ్‌మెన్ లేకపోవడం వల్ల రాత్రి వేళల్లో కాస్త ఇబ్బంది అవుతుందన్నారు.ఆసుపత్రి పునర్నిర్మాణ పనులు జరుగుతున్న సందర్భంగా డెలివరీలు ఇక్కడ ప్రస్తుతానికి చేయడం లేదన్నారు.డెలివరీ కేసులను మల్కాజిగిరి జిల్లా ఆఫీసుకు లేదా ఘట్‌కేసర్ మండల ప్రాథమిక ఆసుపత్రికి పంపడం జరుగుతుందన్నారు.మరిన్ని మెరుగైన వైద్య సేవల కోసం ప్రభుత్వం అదనంగా స్టాఫ్ నర్స్‌లను కేటాయించాలన్నారు.అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి సత్యం మాట్లాడుతూ జనాభా గతం కంటే చాలా పెరిగిందని,పెరిగిన జనాభాకు అనుగుణంగా మరొక ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సుమారు 80 వేల జనాభా ఉన్న అహ్మద్‌గూడ ప్రాంతంలో ఏర్పాటు చేయాలన్నారు.కీసర ప్రభుత్వ ప్రైమరీ హెల్త్ సెంటర్ నిర్వహణ,అదనపు స్టాఫ్ నర్స్ కోసం బిల్డింగ్ పునర్మిరాణ పనులు పూర్తయ్యే విదంగా సంబందిత ఉన్నాతాధికారుల దృష్టికి,జిల్లా కలెక్టర్,రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని సమస్యలు పరిష్కారం అయ్యేంత వరకు సిపిఎం పార్టీ ఆందోళన నిర్వహిస్తుందన్నారు.అలాగే ప్రభుత్వ హై స్కూల్‌ను సందర్శించి అక్కడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులకు సరిపడా టాయిలెట్లు నిర్మాణం చేయాలన్నారు.మన ఊరు మన బడి కార్యక్రమంలో మొదలుపెట్టిన బాత్రూంల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.యుద్ధ ప్రాతిపదికన విద్యార్థుల అవసరాల రీత్యా వెంటనే బాత్రూంలను నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులను డిమాండ్ చేశారు.విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేచ విదంగా హిందీ భాష,సాంఘిక శాస్త్రం బోధించడానికి అదనంగా క్యాలిఫైడ్ టీచర్‌ను కేటాయించాలన్నారు.నేటి విద్యార్థులు శాస్త్ర సాంకేతిక విద్యను అందించడానికి కంప్యూటర్ టీచర్‌ను కూడా నియమించాలన్నారు.విద్యార్థులకు స్కూలు అవసరాల రీత్యా బోరు బావిని ఏర్పాటు చేయాలన్నారు.నాణ్యమైన త్రాగు నీరును అందించాలన్నారు.విద్యార్థుల ఆరోగ్య రీత్యా ఆర్వో పూర్తిపై వాటర్ ప్లాంటును ఏర్పాటు చేయాలన్నారు.ప్రైమరీ,హై స్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు.మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన పౌష్టిక ఆహారం అందించాలన్నారు.విద్య వైద్యం మెరుగైన సేవలు అందించే విదంగా సంబందిత ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం చొరవ తీసుకుని మెరుగైన మౌళిక సదుపాయాల కోసం ప్రత్యేకమైన నిధులు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు.సిపిఎం పార్టీ కార్యదర్శిలు అశోక్,శ్రీనివాసులు,ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ చేసిన బిఆర్ఎస్ నేతలు

**మేడ్చల్, జూన్ 30, ప్రభాతవార్త :** గుండ్లపోచంపల్లి డివిజన్లో గౌడవెల్లిలో జరుగుతున్న సర్ ప్రక్రియలో బిఆర్ఎస్ నేతలు పాల్గొని ఎన్యూమరేషన్ పత్రాలను ఓటర్లకు పంపిణీ చేశారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ బిఎల్‌వోలు ఇచ్చే ఎన్యూమరేషన్ ఫారాలను నింపి నిర్ణీత సమయంలోపల తిరిగి అందజేయాలని ఈ సందర్భంగా నాయకులు అవగాహన కల్పించారు. నిర్లక్ష్యం చేస్తే ఓట్లు గల్లంతయ్యే ప్రమాదం ఉందని, ఓటు హక్కునుకోల్పోతే భవిష్యత్లో జరిగే ఎన్నికల్లో పాల్గొనే అవకాశం ఉండదన్నారు. అవసరమైన సహాయ సహకారాలు అందించడానికి తాము సిద్ధంగా ఉన్నా మన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షుడు రాజు, మాజీ సర్పంచ్ జగన్‌రెడ్డి, నాయకులు నర్సింహ గౌడ్, సుదర్శన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, సదానంద్,సింహల్ యాదవ్, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గౌడవేల్లిలో న్యూమరేషన్ పత్రాలను పంపిణీ చేస్తున్న బిఆర్ఎస్ నేతలు



సుల్తాన్‌పూర్‌లో గ్రామసభలో మాట్లాడుతున్న అధికారులు

## భూసేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ

**-సుల్తాన్‌పూర్ తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో గ్రామసభలు నిర్వహణ**

**దౌల్తాబాద్,జూన్ 30,ప్రభాతవార్త:** కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకంలో భాగంగా దౌల్తాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది.ఇందులో భాగం గా మంగళవారంరోజు సుల్తాన్‌పూర్,తిమ్మారెడ్డిపల్లి గ్రామాల్లో అధికారులు ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు.

ఈ సమావేశంలో అధికారులు మాట్లాడుతూ... కొడంగల్-నారాయణపేట ఎత్తిపోతల పథకం పూర్తయితే సాగునీటి రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని,రైతుల ఆర్థిక స్థితిగతులు మెరుగుపడతాయని రైతులకు వివరించారు.రైతులు అడిగిన పలు సందేహాలకు అధికారులు సమాధానాలు ఇచ్చారు.ప్రజాభిప్రాయసేకరణ ద్వారా వచ్చిన అభిప్రాయాలను క్రోడీకరించి,ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో అనిత,ఇరిగేషన్ డీఈ శ్రీనివాస్,తహసీల్దార్ వెంకటస్వామి,డిప్యూటీ తహసీల్దార్ వెంకటచారి,ఆర్ఐ సునీల్,జిపిఓలు,ఆయా గ్రామాల సర్పంచులు ,రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నారపల్లిలో డ్రైనేజీ సమస్యను త్వరితగతిన పరిష్కరిస్తాం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ 8 నారపల్లిలో నెలకొన్న డ్రైనేజీ సమస్య పరిష్కరానికి అధికారులు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పర్యటించి సమస్యను పరిశీలించారు. అతి తొందరలోనే డ్రైనేజీ సమస్య పరిష్కరిస్తామని ఏఈ విశేశ్ నాయక్ అన్నారు. ఇటీవల మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షుడు టి. వజ్రేశ్ యాదవ్ నారపల్లి పర్యటన సంద ర్భంగా స్థానికులు నారపల్లిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను వివరించారు. వెంటనే స్పందించిన డిసిసి ప్రెసిడెంటు అధికారులను ఆదేశించగా మంగళవారం నారపల్లిలోని టీచర్స్ కాలనీ, బాబా నగర్ కాలనీలను ఏఈ విశేశ్ నాయక్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, డివిజన్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఎర్ర రాజుతో కలిసి సందర్శించారు. నారపల్లిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను త్వరతిగతిన పరిష్కరిస్తామని ఎఇ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మాజీ కౌన్సిలర్ రవీందర్, బీఆర్ఎస్ నాయకులు అబ్బవతి నర్సింహా, నరేందర్ రెడ్డి, స్థానికులు మధుకర్, బి. నాగేశ్వర్, లోకేశ్, ప్రదీప్, వెంకట్‌రెడ్డి, బలరాం, సద్గుణ చారి పాల్గొన్నారు.




పోచారం డివిజన్ నారపల్లిఓ డ్రైనేజీ సమస్యపై ఆరా తీస్తున్న ఘట్‌కేసర్ సర్కిల్ ఏఈ విశేశ్ నాయక్ తదితరులు.

# ప్రజాసేవకు గౌరవ వందనం.. కమిషనర్ బాలాజీకి ఘన వీడ్కోలు

**- మాజీ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ల సేవలను కొనియాడిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**కొత్తూర్, జూన్ 30, ప్రభాతవార్త:** ప్రజలకు నిబద్ధతతో సేవలందించిన అధికారుల సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని, పదవులు ముగిసినా వారు చేసిన సేవలకు సమాజంలో ప్రత్యేక గుర్తింపు ఉంటుందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మంగళవారం కొత్తూరు మున్సిపాలిటీలో మున్సిపల్ కమిషనర్ బాలాజీ పదవీ విరమణ మరియు, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ బాతుక లావణ్య దేవేందర్ యాదవ్, మాజీ కౌన్సిలర్ల పదవీకాలం ముగిసిన సందర్భంగా ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పూలమాలలు వేసి, శాలువాలు కప్పి, జ్ఞాపికలు అందజేసి వారిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే మంచి ఫలితాలు వస్తాయని అన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కమిషనర్ బాలాజీ కుటుంబ సభ్యులతో ఆనందంగా, ఆరోగ్యంగా జీవించాలని ఆకాంక్షి ంచారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ లావణ్య దేవేందర్ యాదవ్ మాట్లాడుతూ, గత ఐదేళ్లలో ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టేలా సేవలందించామని తెలిపారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే, అధికారులు, కౌన్సిలర్లు, ప్రజలకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. పాలకవర్గ సభ్యులందరి సమిష్టి కృషి వల్ల అనేక అభివృద్ధి కార్యక్రమాలు విజయవంతంగా పూర్తయ్యాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, మాజీ కౌన్సిలర్లు చంద్రకళ రాజేందర్ గౌడ్, కోస్గి శ్రీనివాస్, జయమ్మ జనార్దన్ చారి, వీరమోని హేమ దేవేందర్ ముదిరాజ్, కర్ణ శ్రీ సుదర్శన్ గౌడ్, బ్యాగరి ప్రసన్నలత యాదయ్య, సీఐ నర్సయ్య, వైద్యాధికారి దీప్తి, సర్పంచులు కొమ్ము కృష్ణ, అశోక్, మాజీ మండల అధ్యక్షుడు మెండే కృష్ణయ్య యాదవ్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, మున్సిపల్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.





సర్ ప్రక్రియలో పాల్గొన్న కరణం పురుషోత్తంరావు

## సర్ ఓటర్ జాబితాను పారదర్శకంగా నిర్వహించాలి

**పెద్దేముల్, జూన్ 30, ప్రభాతవార్త:** సర్ ఓటర్ జాబితాను మరింత పారదర్శకంగా నిర్వహించాలని ఎస్ఐఆర్ తాండూరు నియోజకవర్గ కన్వీనర్ కరణం పురుషోత్తంరావు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని తట్టెపల్లి, పెద్దేముల్, ఓమ్లా నాయక్‌తాండా, జైరాంతాండా, అడ్కిచెర్ల, పాషపూర్ తదితర గ్రామాల్లో ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా బిఎల్ఓ, బిఎల్ఏలతో పాటు మండల కాంగ్రెస్‌పార్టీ అధ్యక్షుడు రుద్రారం పి.మహిపాల్‌రెడ్డితో కలిసి ఆయన ఇంటింటి ఓటరు సవరణను పరిశీలించారు. ఈ సందర్బంగా కరణం పురుషోత్తంరావు మాట్లాడుతూ సర్ ప్రక్రియలో అర్హుడైన ప్రతి ఓటరు పేరు ఓటరు జాబితాలో కొనసాగడం అత్యంత ముఖ్యమని అన్నారు. గ్రామంలోని ప్రతి ఓటరుకి సరైన సమాచారం అందాలని, పత్రాల సమర్పణ, ధృవీకరణ ప్రక్రియ పారదర్శకంగా, నిష్పాక్షికంగా జరగాలని అన్నారు. ఎవరికి అన్యాయం జరగకుండా అన్ని రాజకీయ పార్టీలతో సమన్వయం చేసుకొని పనిచేయాలని అన్నారు.ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, అర్హులైన ప్రతి పౌరుడు తన పేరును ఓటరు జాబితాలో ఉందో లేదో పరిశీలించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లాలప్ప, టీపీసీసీ మైనార్టీ కన్వీనర్ యండి,రియాజ్, జిల్లా మత్స్య సహకార సంఘం అధ్యక్షులు శ్రీధర్, జిల్లా మాజీ ఉపాధ్యాక్షులు నల్లా ఎల్లారెడ్డి, మాజీ మండలపార్టీ అధ్యక్షులు కొండపురం గోపాల్, సీనియర్ నాయకులు కొమ్ము గోపాల్‌రెడ్డి, కోహీర్ రవి, బీసీ సెల్ ఉపాధ్యాక్షులు ఆనందచారీ, గ్రామ కమిటి అధ్యక్షుడు డివై నర్సిములు, పడగల్ల రాజు, ఎర్ర వెంకటేష్, బిఎల్ఓలు నల్లా శ్రీనివాస్‌రెడ్డి, యండి,నయ్యుం, బ్యాగరి మల్లేశం, రొంపల్లి మల్లప్ప, ఏక్బాల్, కారోబార్ నర్సిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## యాచారం వాసి కొప్పు విష్ణుకి డాక్టరేట్



ప్రమాణ పత్రం అందుకుంటున్న విష్ణు

**యాచారం,జూన్ 30, ప్రభాతవార్త:** యాచారం మండలం అయ్యవారిగూడ గ్రామానికి చెందిన కొప్పు విష్ణు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్(పీహెచ్డీ) పట్టా మంగళవారం అందుకున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ జువాలజీ విభాగం ప్రొఫెసర్ ఏ.వి. రాజశేఖర్ పర్యవేక్షణలో తన పరిశోధనను పూర్తి చేశారు.తెలంగాణ రాష్ట్రం, రంగారెడ్డి జిల్లాలోని రవిర్యాల పెద్ద చెరువులో నీటి నాణ్యత లక్షణాలకు సంబంధించి జూప్లాంక్టన్ సమృద్ధి మరియు చేపల జీవజాతులపై అధ్యయనాలు" అనే అంశంపై ఆయన సమర్పించిన పరిశోధనకు ఓయూ డాక్టరేట్ ప్రకటించింది. పెద్దచెరువు నీటి నాణ్యత, జూప్లాంక్టన్ మరియు చేపల జీవజాతులపై చేసిన ఈ పరిశోధన భవిష్యత్తులో నీటిపారుదల శాఖ, కాలుష్య నియంత్రణ, మత్స్యశాఖ, గ్రామీణ తాగునీటి, పురపాలక మరియు పంచాయతీ, శాస్త్ర సాంకేతిక రంగానికి దోహదపడుతుందని నిపుణులు పేర్కొంటున్నారు.



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సుంకి రెడ్డి రాఘవేంద్ర రెడ్డి

## ముగిసిన ఉచిత కానిస్టేబుల్ శిక్షణ

**తలకొండపల్లి ,జూన్ 30,ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఎస్సై కానిస్టేబుల్ శిక్షణ తరగతులు మంగళవారం నాడు ముగిశాయి. గత రెండు నెలలుగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులకు మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిరుద్యోగ యువతీ యువకులు హాజరై శిక్షణ తీసుకున్నారు. ఈ ముగింపు కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరైనరు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణ పూర్తి చేసుకున్న యువకులకు అభినందనలు తెలియజేస్తూ రాబోవు పోలీస్ నియామక పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు పొందాలన్నారు. క్రమశిక్షణ పట్టుదల ఆత్మవిశ్వాసం విజయానికి పునాదుల వంటివని ప్రతి విద్యార్థి లక్ష ్యసాధన కోసం నిరంతరం శ్రమించి లక్ష్యాన్ని సాధించుకోవాలని ఆయన తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగం ఉపాధి మాత్రమే కాదని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే బాధ్యతను కలిగి ప్రభుత్వ ఉద్యోగం ఉపాధి మాత్రమే కాదని ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కల్పించే బాధ్యతను కలిగి ఉంటుందని ఉంటుందని, సమాజానికి సేవ చేసే అవకాశం కలుగుతుందని ఆయన వివరించారు. ప్రణాళిక బద్ధమైన చదువు శారీరకద్రుడత్వం సమయపాలన నిరంతర సాధనకు ఎంతో కృషి చేస్తాయని అపజయాలను చూసి నిరుత్సాహ పడకుండా ప్రతి ప్రయత్నాన్ని విజయానికి మార్గంగా మలుచు కోవాలని ఆయన సూచన చేశారు. గత 70 రోజులుగా తీసుకున్న శిక్షణ తప్పకుండా సద్వినియోగం మార్చుకోవాలని జ్ఞానం నవ్వుకున్నారు వారి ఉద్యోగ సాధనలో కీలకపాత్ర పోషిస్తాయని ఆయన పేర్కొన్నారు. భవిష్యత్తులో ఐక్యత పౌండేషన్ ఆధ్వర్యంలో స్కిల్ కు ఫ్యాక్టరీ ద్వారా,ఐటి భాష నైపుణ్యాలు ఉపాధి మరియు నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహించి కల్వకుర్తి నియోజకవర్గం యువతి యువకులకు అందుబాటులోకి తీసుకువస్తామని ఈ సందర్భంగా ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, అధ్యాపకులు విశ్వనాథ్ ఐక్యత ఫౌండేషన్ సభ్యులు యాదయ్య, విజయ్ కుమార్ లతోపాటు శిక్షణ పొందిన అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

## మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్ కొరకు దరఖాస్తులకు ఆహ్వానం

**మేడ్చల్, జూన్ 30. ప్రభాతవార్త :** మేడ్చల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిపోయిన సీట్ల భర్తీ కోసం స్పాట్ అడ్మిషన్ తీసుకుంటున్నామని, అందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఆ పాలిటెక్నిక్ కళాశాల అరుందతి ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నేటి నుండి ఈ నెల 3వ తేదీ సాయంత్రం 4 గంటలలోపు అర్హులైన వారు కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఈ నెల 4వ తేదీన ఉదయం 9.30 గంటలకు ఒరిజనల్ టిసితో హజరు కావాలన్నారు. మేడ్చల్ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రస్తుతం ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 8, మెకానికల్ ఇంజనీరింగ్ 8, ఆటోమేషన్ అండ్ రోబోటిక్‌లో 15 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వివరాల కొరకు 8096951516, 9347615836 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# ప్రజారోగ్యానికి ముప్పుతెస్తున్న మురుగు

**జవహర్ నగర్, జూన్ 30, ప్రభాత వార్త:** జవహర్ నగర్ పరిధిలోని అంబేద్కర్ నగర్ హైటెన్షన్ లైన్ ప్రాంతంలో డ్రైనేజీ సమస్య తీవ్రరూపం దాల్చి స్థానిక ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తోంది. పలుమార్లు సంబంధిత అధికారులకు, కమిషనర్‌కు విన్నవించినప్పటికీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో బస్తీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైటెన్షన్ లైన్ ఇరువైపులా నివసిస్తున్న ప్రజల ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు రోడ్లపైకి చేరి ప్రవహిస్తుండటంతో దుర్వాసన వ్యాపించడంతో పాటు ప్రజారోగ్యానికి ముప్పుగా మారిందని స్థానికులు తెలిపారు. వర్షాకాలంలో పరిస్థితి మరింత దారుణంగా మారి దోమలు, ఈగలు పెరిగి అంటు వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో ఒక వైపు 4వ డివిజన్, మరోవైపు 5వ డివిజన్ పరిధికి చెందిన ప్రజలు నివసిస్తున్నప్పటికీ, సమస్య పరిష్కారంపై బాధ్యతను ఒకరిపై మరొకరు నెట్టివేస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. ప్రాంత పారిశుధ్యాన్ని మెరుగుపరచడానికి తక్షణమే డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయడంతో పాటు రోడ్డు నిర్మాణ పనులను చేపట్టాలని బస్తీవాసులు డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి సమస్యను పరిష్కరించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.


అధికారుల నిర్లక్ష్యానికి అంబేద్కర్ నగర్ రోడ్డుపై పారుతున్న మురుగునీరు

# స్థానికేతరులు వద్దు.. స్థానిక ఓటర్లే ముద్దు

**నందిగామ, జూన్ 30, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికల నిర్వహణకు అత్యంత ప్రాధాన్యత ఉంటుందని, ఎన్నికలు పారదర్శకంగా జరగాలంటే నకిలీ ఓట్లు, ద్వంద్వ ఓట్లు పూర్తిగా తొలగిపోవాలని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. మంగళవారం నందిగామ మండలం సిడి తండా, రంగాపూర్ లలో సర్పంచ్ గబ్బు చౌహాన్, గోవు అంజమ్మ ల ఆధ్వర్యంలో జరిగిన సర్ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ద్వారా అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. సర్ పై సంబంధిత అధికారులు అందించే దరఖాస్తు పత్రాలను తీసుకుని, అవసరమైన వివరాలను సక్రమంగా నమోదు చేసి తమ ఓటు హక్కును పరిరక్షి ంచుకోవాలని కోరారు. ఈ ప్రక్రియ ద్వారా నకిలీ ఓట్లు, ద్వంద్వ ఓట్లు, మరణించిన వ్యక్తుల పేర్లపై ఉన్న ఓట్లు, తప్పుగా నమోదైన ఓట్లు తొలగించే అవకాశం ఉంటుందని తెలిపారు. పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పిస్తూ, ఓటరు నమోదు ప్రక్రియలో సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఎం శివశంకర్ గౌడ్, మాజీ సర్పంచ్ జటావత్ రాజు నాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్, ఉప సర్పంచ్ లు రవిందర్ నాయక్, జింకల బసవరాజ్, వార్డు సభ్యులు జటావత్ రాజేష్, జటావత్ మాధవి లక్ష్మణ్ నాయక్, బుజ్జి శంకర్, పాత్లావత్ శ్రీను, శాంతి శ్రీను, మోగావత్ నాగేష్, పత్తి శీను, పంచాయతీ కార్యదర్శి రవిందర్ నాయక్ తదితరులు ఉన్నారు.


సిడితండాలో సర్ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

# అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీ సీజ్

**కొడంగల్,జూన్ 30,ప్రభాతవార్త :** ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న లారీని మంగళవారం పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు.వివరాల్లోకి వెళితే..సోమవారం రాత్రి ఆంధ్రాకు చెందిన లారీ అధిక లోడ్‌తోపాటు(ఆంధ్రా వరకు మాత్రమే) ఉన్న అనుమతులు ఉన్న పత్రాలతో ఇసుకను కొడంగల్‌లోని ఓ ప్రైవేట్ డంపింగ్ యార్డుకు తీసుకొని వచ్చారు.డంపింగ్‌యార్డులో ఇసుకను ఖాళీ చేస్తుండగా లారీ అసోసియేషన్ సభ్యులు అందరు కలిసి ఆంధ్రాకు చెందిన ఇసుక లారీ కొడంగల్‌లో ఇసుక ఖాళీ చేస్తుందని పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు వచ్చి ఇసుక లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.మంగళవారం ఆర్టీఓ అధికారులు వచ్చి ఇసుక లారీని సీజ్ చేశారని ఎస్సై సత్యనారాయణ తెలిపారు.ఇలాంటి లారీలతో ఇసుక డంపులు చేసి ఇష్టానుసారంగా ఇసుకను విక్రయిస్తున్నారని పట్టణ ప్రజలు ఆరోపించారు.


అక్రమంగా తరలిస్తున్న ఇసుక లారీని పోలీసులు పట్టుకున్న దృశ్యం

# అనురాగ్‌లో విజయవంతంగా ముగిసిన అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 30, ప్రభాత వార్త:** అనురాగ్ యూనివర్సిటీలో అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం విజయవంతంగా ముగిసిందని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డీన్ ప్రొఫెసర్ ఉప్పు బాలాజీ తెలిపారు. పోచారం డివిజన్ వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీలో గత వారం రోజులుగా జరిగిన అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ముగింపు సమావేశం మంగళవారం జరిగిందని తెలిపారు. ముగింపు కార్యక్రమంలో ఫిలాసఫీ ఆఫ్ సైన్స్ హెచ్ వి. విష్ణువదన మాట్లాడుతూ పరిశోధన మౌలికాంశాలు, వివిధ పరిశోధన పద్ధతులపై అధ్యాపకులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. కేస్ స్టడీ ఆధారిత బోధన ద్వారా విద్యార్థులు తరగతి గది చర్చల్లో మరింత చురుకుగా పాల్గొంటారని వివరించారు. ఆ కార్యక్రమంలో అధ్యాపకులు బిజినెస్ స్ట్రాటజీ, మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంటు, ఆపరేషన్స్ వంటి విభాగాలకు సంబంధించిన పలు కేస్ స్టడీలను విశ్లేషించారు. ఈ శిక్షణ ద్వారా అధ్యాపకుల బోధనా నైపుణ్యాలు, పరిశోధన సామర్థ్యాలు మరింత మెరుగుపడేలా మార్గదర్శకత్వం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.



అనురాగ్ యూనివర్శిటీలో అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం ముగింపు సమావేశానికి హాజరైన అధ్యాపకులు.


పదవీ విరమణ పొందిన రత్నయ్యను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

## ప్రపంచానికి మార్గదర్శకులు గురువులు

**నందిగామ, జూన్ 30, ప్రభాతవార్త :** ప్రపంచానికి మార్గదర్శకులు గురువులని,సమాజ వికాసంలో.. విద్యార్థుల ప్రగతికి పూలబాట వేసే ఉపాధ్యాయుల పాత్ర పవిత్రమైనదని షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. మంగళవారం నందిగామ మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రత్నయ్య పదవి విరమణ ఆత్మీయ సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. 14 సంవత్సరాలు రత్నయ్య విద్యార్థులకు చేసిన సేవలు అజరామరం అన్నారు. అనంతరం పదవి విరమణ పొందిన రత్నయ్య దంపతులను పూలమాలవేసి శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఏఎంసి డైరెక్టర్ నర్సింలు, కాంగ్రెస్ సీనియర్ నేత జిల్లెల్ల బాల్ రెడ్డి, సర్పంచులు సాలయ్య, గొర్లపల్లి అశోక్, సీనియర్ నేతలు జండగూడెం సుదర్శన్ గౌడ్, పసుల బుచ్చయ్య, కావలి కృష్ణ, కుందారం వెంకట్ రెడ్డి,వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, శివగల్ల ప్రవీణ్, బొమ్మగళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, కిట్టు, సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

## బాధితులకు న్యాయం చేయాలి

**ధారూర్, జూన్ 30, ప్రభాత వార్త:** ధారూర్ మండలంలో బుడగ జంగం కుటుంబంపై జరిగిన దాడి ఘటనపై దళిత, మైనార్టీ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. తమపై దాడి చేసి, కులం పేరుతో దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరడానికి వెళ్లిన బాధితులను, పోలీసులు పట్టించుకోకుండా నిందితులకు మద్దతుగా వ్యవహరించారని బాధితులు ఆరోపించారు. స్థానిక ఎస్సై ఏకపక్షంగా వ్యవ హరిస్తూ, ఫిర్యాదు చేయడానికి వెళ్లిన తమనే ఇబ్బందులకు గురిచేశారని వారు వాపోయారు. దాడి చేసిన నిందితులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసులు నమోదు చేయాలని ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. తక్షణమే న్యాయం చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరించారు.

## ఓటరు సవరణ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలి

**షాబాద్, జూన్ 30, ప్రభాతవార్త :** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని అధికారులు సమర్థవంతంగా నిర్వహించి ప్రతి అర్హుడికి అవకాశం కల్పించాలని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు.షాబాద్ మండలంలోని హైతాబాద్ గ్రామంలో సోమవారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచ్ కర్రోళ్ల శాంతమ్మ యాదయ్య, సర్వే ప్రక్రియ సూపర్వైజర్ నరేష్, జీపీఓ, బీఎల్ఓలతో కలిసి ఓటరు సవరణ దరఖాస్తు ఫారాలు ప్రతి ఇంటికి సకాలంలో చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని ప్రజలకు పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమంలో హైతాబాద్ మాజీ సర్పంచ్ ఎండి ఖజా మియా పటేల్, వార్డు సభ్యులు కావలి రవి, బుడ్డిగారి సత్తయ్య, పులిగారి బుచ్చమ్మ, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి జాంగిర్, టేకుల చంద్రారెడ్డి, మంగలి శేఖర్, అత్తిలి శ్రీనివాస్ రెడ్డి, గౌస్ పాషా, వెంకట్ రెడ్డి, శ్రీరాములు, గౌస్, కుమ్మరి బాలయ్య, కుమ్మరి శాంతప్ప, చర్ల సత్తయ్య, హైదర్గూడం శ్రీనివాస్, లక్ష్మణ్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


హైతాబాద్ గ్రామంలో ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమంలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్

## విద్యార్థుల సమస్యలు పరిష్కరించటంలో ఎన్ ఎస్ యు ఐ ముందు ఉంటుంది

**చేవెళ్ల జూన్ 30, ప్రభాతవార్త :** విద్యార్థుల సమస్యలు పరిష్కారంలో ఎన్ ఎస్ యు ఐ ఎప్పటికీ ముందు ఉంటుంది ఎన్ ఎస్ యు ఐ చేవెళ్ల మండలం కమిటీ సభ్యుడు సమీరుద్దీన్ అన్నారు.. చేవెళ్ల మున్సిపాలిటీ పట్టణ కేంద్రం లోని పారామెడికల్ కళాశాలలో విద్యార్థుల సమస్యలు తెలుసు కోవడం జరిగింది.. ఈ సంద ర్భంగా సమీర్ మాట్లాడుతూ నేషనల్ స్టూడెంట్స్ యూని యన్ ఆఫ్ ఇండియా అనేది ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ యొక్క విద్యార్థి విభాగం. 1971 ఏప్రిల్ 9న ఇందిరా గాంధీచే స్థాపించబడిన ఇది, ప్రగతిశీల ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం మరియు అందరికీ అందుబాటులో ఉండే విద్య కోసం వాదిస్తుంది. లక్షలాది మంది సభ్యులతో, ఇది భారత క్యాంపస్ రాజకీయాలలో ఒక ప్రధాన శక్తిగా నిలిచింది అని అన్నారు.. మరియు అదే విధంగా దేశవ్యాప్తంగా విద్యార్థుల సమస్యలపై దాదాపు 55 సంవత్సరాల నుండి పోరాడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ యుఐ చేవెళ్ల మండల కమిటీ సభ్యులు ఎండీ ఇర్ఫాన్, జావీద్, అజర్, సాయి, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయం నిర్మాణానికి రాంరెడ్డి విరాళం

**ఘట్‌కేసర్, జూన్ 30, ప్రభాతవార్త:** మేడిపల్లిలో నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయ నిర్మాణానికి కొంతం రాంరెడ్డి-సుగుణ దంపతులు రూ.50,116లు విరాళం అందజేశారు. ఘట్‌కేసర్ డివిజన్ శివారెడ ్డిగూడకు చెందిన శ్రీదండ్లగడ్డ ప్రసన్న వీరాంజనేయ -మల్లిఖార్జునస్వామి దేవ స్థానం చైర్మన్-మాజీ వార్డు సభ్యులు కొంతం రాంరెడ్డి మేడిపల్లిలోని నిర్మిస్తున్న శ్రీసీతారామచంద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఈసంద ర్భంగా ఆలయ కమిటీ విజ్ఞప్తి మేరకు రాంరెడ్డి, సుగుణ దంపతులు రూ.50,116లు తమ వంతు విరాళంగా అందజేశారు. ఆలయ అభివృద్ధికి తన సహకారం ఉంటుందని ఆయన ఆలయ కమిటీ సభ్యులకు తెలియజేశారు.


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న రాంరెడ్డి

# ధారూర్‌లో ఘర్షణ, పరస్పర ఫిర్యాదులు

**..విచారణ చేపట్టిన పోలీసులు**

**ధారూర్. జూన్ 30, ప్రభాతవార్త:** ధారూర్ మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం జరిగిన ఘర్షణ స్థానికంగా కలకలం రేపింది. తప్పిపోయిన గెదెల కోసం వెళ్ళిన క్రమంలో ఇరువర్గాల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ ఉద్రిక్తతకు దారితీసింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ధారూర్ గ్రామానికి చెందిన నఫీజ్ తన తమ్ముడు ఖాజా, స్నేహితుడు శివతో కలిసి గెదెల కోసం వడ్డెర కాలనీ వైపు వెళ్ళగా, అక్కడ ఉన్న నర్సిములు, అనిల్, అశోక్‌లతో ఘర్షణ జరిగిందని సమాచారం. ఈ ఘటనలో తమపై దాడిచేసి, ఆటో అద్దాలు పగులకొట్టారని నఫీజ్ వర్గం వారు ఆరోపించగా, మరో వర్గం వారు కూడా తమపై ఎదురుదాడి జరిగిందని పిర్యాదు చేశారు. దీనిపై ధారూర్ ఎస్ఐ సున్నం రాఘవేందర్ స్పందిస్తు ఇరువర్గాల నుంచి పిర్యాదులు అందాయని తెలిపారు. ప్రస్తుతం ఘటనపై విచారణ కొనసాగుతుందని, ప్రాథమిక విచారణ అనంతరం కేసునమోదు చేస్తామని ఎస్ఐ పేర్కొన్నారు.

# ప్రభుత్వ బడిలో విద్యార్థుల సంఖ్య పెరుగుదల

**..మన్మర్రి ప్రాథమిక పాఠశాలలో కొత్తగా 24 మంది చేరికలు**

**.. మొత్తం విద్యార్థులు 55**

**షాబాద్, జూన్ 30, ప్రభాతవార్త :** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధన, గ్రామస్తుల సహకారంతో విద్యార్థుల చేరికలు గణనీయంగా పెరుగుతున్నాయని మన్మర్రి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మర్పల్లి అశోక్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమైన అనంతరం కొత్తగా 24 మంది విద్యార్థులు చేరడంతో పాఠశాలలో మొత్తం విద్యార్థుల సంఖ్య 55కు చేరిందని ఆనందం వ్యక్తం చేశారు. విద్య వ్యక్తి జీవితాన్ని తీర్చిదిద్దే అమూల్యమైన సంపద అని, సమాజ అభివృద్ధికి నాణ్యమైన విద్య ఎంతో అవసరమని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఆధునిక తరగతి గదులు, డిజిటల్ బోధన, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, స్వచ్ఛమైన తాగునీరు, మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాంలు వంటి సౌకర్యాలు అందుబాటులో ఉండటంతో తల్లిదండ్రులు ప్రభుత్వ బడుల వైపు మొగ్గు చూపుతున్నారని పేర్కొన్నారు. వేసవి సెలవుల్లో ఉపాధ్యాయులు, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి విద్య ప్రాముఖ్యతను వివరించడంతో పాటు పాఠశాల ప్రత్యేకతలను తెలియజేయడం వల్ల చేరికలు పెరిగాయని చెప్పారు. విద్యార్థుల్లో చదువుపై ఆసక్తి పెంచేందుకు వినూత్న బోధనా పద్ధతులను అమలు చేస్తున్నామని తెలిపారు. గ్రామపంచాయతీ, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, పూర్వ విద్యార్థులు, దాతలు, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పాఠశాల అభివృద్ధి సాధ్యమైందని, ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వ బడులపై విశ్వాసం మరింత బలపడిందన్నారు. విద్యార్థుల సంఖ్య పెరగడం ప్రభుత్వ పాఠశాలల ప్రతిష్ఠను పెంచడంతో పాటు సమాన విద్యా అవకాశాలు కల్పించడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సహకరించిన గ్రామపంచాయతీ పాలకవర్గానికి, గ్రామస్తులకు ప్రధానోపాధ్యాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటమ్మ, శ్రీలత, అనురాధ, చంద్రకళ, శ్యామలమ్మ, మల్లమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# మట్టిలో మాణిక్యాలను వెలికి తీయాలి

**నందిగామ, జూన్ 30, ప్రభాత వార్త:** క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓడిన వారు బాధపడకుండా క్రీడా స్ఫూర్తిని చాటాలనీ షాద్నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పష్టం చేశారు. గత 12 రోజులుగా వెంకమ్మగూడ సర్పంచ్ గోర్లపల్లి అశోక్, కాంగ్రెస్ సీనియర్ నేత పసుల బుచ్చయ్యల ఆధ్వర్యంలో నిర్వహించిన సిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సమావేశానికి ఎమ్మెల్యే విచ్చేసి విజేతలకు బహుమతులు అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేగూరులో క్రీడా స్థలం కోసం తనవంతు కృషిచేస్తామన్నారు. ఈ టోర్నమెంట్లో సన్‌రైజర్స్ హైదరా బాద్ జట్టు విన్నర్ కప్‌తో పాటు రూ.30 వేల నగదు అందుకున్నారు, ఢిల్లీ రన్నర్ కప్పుతో సరిపెట్టుకొని రూ.20 వేల నగదు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి ఎం శివశంకర్ గౌడ్, సర్పంచ్ మంకాల శ్రీశైలం, ఉప సర్పంచ్ ఆవులమంద శివశంకర్ గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దేపల్లె కుమార్ గౌడ్,బుగ్గోని గూడ సర్పంచ్ సాలయ్య, నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఏఎంసీ డైరెక్టర్లు నర్సింలు, ధరూర్ సతీష్ పాటిల్, నాయకులు బుయ్యని వీరేందర్ గౌడ్ , కావలి కృష్ణ,గుండాల వేణుగోపాల్, బుగ్గ శ్రవణ్, వెంకటాచారి తదితరులు పాల్గొన్నారు.


చేగూరులో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్.

## నిబద్ధతకు నిదర్శనం ఎస్సై శంకర్ రెడ్డి సేవలు

**షాబాద్, జూన్ 30, ప్రభాతవార్త :** షాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విశిష్ట సేవలందించిన శంకర్ రెడ్డి పదవీ విరమణ సందర్భంగా సోమవారం ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ రెడ్డి, ఆయన సతీమణి సునితలను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న చేవెళ్ల ఏసీపీ కిషన్ మాట్లాడుతూ, శంకర్ రెడ్డి తన ఉద్యోగ జీవితమంతా క్రమశిక్షణ, నిజాయితీ, ప్రజాసేవకు అంకితభావంతో విధులు నిర్వహించారని కొనియాడారు. ప్రజలతో స్నేహపూర్వకంగా మెలుగుతూ, పోలీసు శాఖకు మంచి పేరు తీసుకువచ్చారని తెలిపారు. పదవీ విరమణ అనంతరం కూడా ఆయన ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షి ంచారు.షాబాద్ సీఐ కాంత రెడ్డి, ఎస్సైలు రమేష్, సతీష్‌తో పాటు పోలీసు అధికారులు, సిబ్బంది శంకర్ రెడ్డితో కలిసి పనిచేసిన అనుభవాలను గుర్తుచేసుకుని ఆయన సేవలను ప్రశంసించారు.ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, కుటుంబ సభ్యులు, మీడియా ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, శ్రేయోభిలాషులు పాల్గొని శంకర్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

## పదవీ విరమణ పొందిన హెచ్‌ఎం సీతాదేవికి వీడ్కోలు

**కొడంగల్,జూన్ 30,ప్రభాతవార్త:** మండల పరిధిలోని రుద్రారం జడ్పీహెచ్ఎస్ ఉన్నత పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు సీతాదేవి ఉద్యోగ విరమణ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహిం చారు. పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు రాములు అధ్యక్షతన నిర్వ హించిన వీడ్కోలు సభకు ఎంఈఓ రాంరెడ్డి,వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు, గ్రామస్థులు పాల్గొని అమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దౌల్తాబాద్ ఎంఈఓ వెంకటస్వామి,పీఆర్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటయ్య,మండల శాఖ అధ్యక్షులు అబ్దుల్‌హాక్, దినేష్,రుద్రారం సర్పంచ్ ఎల్లప్ప,సంతోష్,హన్మయ్య,గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పదవి విరమణ పొందిన హెచ్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం

**హైకోర్టు ఆదేశాలను ధిక్కరించి**

## ప్లాట్లను కబ్జా చేయడం మానుకోవాలి



టిజిఐఐసి కార్యాలయం ముందు మాట్లాడుతున్న తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దార సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త రవి,తదితరులు

**శంషాబాద్ , జూన్ 30,ప్రభాతవార్త :** టీజీఐఐసీ అధికారులు అక్రమంగా హార్డ్‌వేర్ పార్కు పేరుతో ప్రైవేట్ ప్లాట్లను కబ్జా చేసే చర్యలను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ జనసమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు దార సత్యం, జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్త రవి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.మంగళవారం టిజిఐఐసి శంషాబాద్ జోన్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ....రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఆదిబట్ల గ్రామంలోని సర్వే నెం.67లో దాదాపు 300 ప్లాట్లకు హైకోర్టు ఆదేశాలను ధిక్కరిస్తూ ప్రహరీ గోడ నిర్మించడం, ఇనుప గేట్లు ఏర్పాటు చేయడం తీవ్ర అభ్యంతరకరమని వారు పేర్కొన్నారు.డబ్ల్యు.వి నెం.27809/2018లో తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను గౌరవించకుండా అధికారులు వ్యవహరించడం రాజ్యాంగ విరుద్ధమని, న్యాయవ్యవస్థను అవమానించే చర్యగా భావిస్తున్నామని తెలిపారు.చిన్న, మధ్యతరగతి కుటుంబాలు జీవితకాల పొదుపుతో కొనుగోలు చేసిన ప్లాట్లను బలవంతంగా స్వాధీనం చేసుకునే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టు ఆదేశాలను యథావిధిగా అమలు చేసి, ప్లాట్ యజమానుల హక్కులను పరిరక్షి ంచాలని కోరారు.లేనిపక్షంలో బాధిత ప్లాట్ యజమానులతో కలిసి తెలంగాణ జనసమితి అధ్యక్షులు ఎంఎల్సీ కోదండరాం నాయకత్వాన చట్టబద్ధమైన ప్రజా ఉద్యమాన్ని చేపట్టి, న్యాయం కోసం అన్ని ప్రజాస్వామ్య మార్గాల్లో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

## మాజీ ఐపిఎస్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై కక్షసాధింపు చర్యలు తగవు

**మొయినాబాద్, జూన్ 30, ప్రభాతవార్త:** మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై రాజకీయ కక్షసాధింపు చర్యలు చేపట్టడం సరికాదని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు షాబాద్ ప్రవీణ్ కుమార్ అన్నారు. మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రాణాలకు ముప్పు ఉన్న నేపథ్యంలో ఆయనకు కల్పించిన భద్రతను తగ్గించడం ఆందోళన కలిగించే విషయమని పేర్కొన్నారు.బీజేపీ, కాంగ్రెస్ కలిసి చేస్తున్న కుట్రలో భాగంగానే ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రతను తగ్గించారని ఆయన ఆరోపించారు. దళిత నాయకుడు రాజకీయంగా ఎదగడాన్ని కొందరు ఓర్వలేకపోతున్నారని, ప్రభుత్వ వైఫల్యాలను అడుగడుగునా ప్రశ్నిస్తూ ప్రజల తరఫున పోరాడుతున్నందుకే ఆయనను లక్ష్యంగా చేసుకుని కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారని విమర్శించారు.తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాస్వామ్య విలువలను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తోందని షాబాద్ ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. రాజకీయ విభేదాలను పక్కనబెట్టి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షి ంచాలని, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు గతంలో ఉన్న భద్రతను వెంటనే పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు.

## రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి సారిస్తా


**శామీర్‌పేట, జూన్ 30, ప్రభాతవార్త:** శామీర్‌పేట రాజీవ్‌రహదారిన రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు శామీర్‌పేట సిఐ (ఎస్‌హెచ్‌ఓ) కె.నర్సింహ్మారెడ్డి తెలిపారు. పోలీసుల, మీడియా ప్రతినిధుల మధ్య పరస్పర సమన్వయం ఉండాలని, పోలీసులు మరింత సేవలు అందించటానికి దోహదపడుతుందని ఆయన అన్నారు. అయితే శామీర్‌పేట సిఐగా కె.నర్సింహ్మారెడ్డి బాధ్యతలు చేపట్టిన తరువాత మీడియా ప్రతినిధుల పరిచయం, విధి నిర్వహణలో సహకారం విషయంపై ఆయన చర్చించారు. మంగళవారం శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో మీడియా ప్రతినిధులతో మాటాడుతూ శామీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో రాజీవ్‌రహదారిన రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టి కార్యచరణ చేపడుతామన్నారు. ప్రమాదాలు జరగకుండ బ్లాక్ స్పాట్‌లను గుర్తించి సంబం ధిత అధికారులతో చర్చించి రోడ్ల మరమ్మతులు చేపట్టటానికి కృషి చేస్తామని, అదే విధంగా ప్రమాదాల నివారణకు అవసరం ఉన్న చోట హెచ్చిరికల బోర్డులు, స్పీడ్ బ్రేకర్స్, రోడ్డు మార్కింగ్‌లు వంటి ఏర్పాటుకు సంబంధిత అధికారులతో మాట్లాడి కృషి చేస్తామన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు సహకారం ఉండాలన్నారు. అదే విధంగా మాధకద్రవ్యాల నిర్మూలనకు, ట్రాఫిక్ నియామాల అమలుకు శాంతి భద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో ప్రజల సహకారం కీలకమన్నారు. శామీర్‌పేట ప్రాంతాన్ని ప్రశాంతమైన ప్రాంతంగ ఉండేలా పోలీసు శాఖ అందుబాటులో ఉంటూ సేవలు అందిస్తుందన్నారు. యువతకు పలు అంశాలపై చైతన్యం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. మీడియా ప్రతినిధులు కూడ పోలీసులకు సహకరిస్తూ ప్రజలను కూడ చైతన్యం చేయాలని సిఐ కె.నర్సింహ్మారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సోమిరెడ్డి, శశివర్ధన్‌రెడ్డి, మీడియా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న సిఐ కె.నర్సింహ్మారెడ్డి,పాల్గొన్న ఎస్ఐలు సోమిరెడ్డి,శశివర్ధన్‌రెడ్డిల దృశ్యం

## నితిన్ నబీన్‌కు జిల్లా బిజెపి కమిటీ తరపున మెమొంటో..సన్మానం

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 30, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా పర్యటనలో పాల్గొన్న బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌ను మేడ్చల్ జిల్లా తరపున జిల్లా బిజెపి రూరల్ కమిటీ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్ మెమోంటో అందజేసి సన్మానించారు. మంగళవారం మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలో జరిగిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ పాల్గొన్నారు. జిల్లా పర్యటనలో పాల్గొన్న బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌కు వీడ్కోలు పలుకుతూ ఆయన జిల్లా తరపున సన్మానించారు. బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్ విచ్చేసి పార్టీ శ్రేణులను ఉత్తేజ పరిచారని అన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రాంచందర్‌రావు, ఎంపి ఈటల రాజేందర్, జిల్లా బిజెపి అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, మాజీ అధ్యక్షులు పి.విక్రమ్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏనుగు సుదర్శన్‌రెడ్డి, జిల్లాల తిరుమలరెడ్డి, జిల్లా కార్యదర్శి అమరం మోహన్‌రెడ్డి, పలువురు నాయకులు పాల్గొన్నారు.


ఫోటోవార్త..30డికె3.మేడ్చల్ జిల్లా ఘట్‌కేసర్ మండలంలో జరిగిన బిజెపి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న బిజెపి జాతీయ అధ్యక్షులు నితిన్ నబీన్‌కు జిల్లా తరపున మెమొంటో అందజేసి సన్మానించిన జిల్లా బిజెపి రూరల్ అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్,పాల్గొన్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర బిజెపి అధ్యక్షులు రాంచందర్‌రావు, పలువురు నాయకుల దృశ్యం